

# మానవ వనరుల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు

- డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు
- వైద్యంపై సంవత్సరానికి రూ.11 వేల 482 కోట్లు ఖర్చు
- రూ.11 వేల 600 కోట్లతో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా సమీకృత గురుకులాల నిర్మాణం
- 90 ట్రామా సెంటర్లు 450 కోట్ల రూపాయలతో ఏర్పాటు
- రఘునాథపాలెం మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన డిప్యూటీ సి.ఎం., మంత్రులు దామోదర రాజనర్సింహ, తుమ్మల, పొంగులేటి


2

**ఖమ్మం నవభూమి బ్యూరో, మే 08:** మానవ వనరుల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సి.ఎం. భట్టి విక్రమార్క మల్లు అన్నారు. గురువారం డిప్యూటీ సీఎం ఖమ్మం అర్బన్ రఘునాథపాలెం మండలంలో 130 కోట్ల ఖర్చుతో నూతనంగా నిర్మిస్తున్న ప్రభుత్వ వైద్య కళాశాల భవన సముదాయ నిర్మాణ పనులకు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రివర్యులు సి. దామోదర రాజనర్సింహ, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, హెల్త్ ప్రిన్సిపల్ సెక్రెటరీ క్రిస్టినా, జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పోలీస్ కమీషనర్ సునీల్ దత్, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, రాందాస్ నాయక్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు మాట్లాడుతూ వైద్య కళాశాలకు శంకుస్థాపన జరగడం చాలా శుభ పరిణామమని, దీంతో మెడికల్ కాలేజ్ కు అను సంధానంగా సూపర్ స్పెషాలిటీ వైద్యం ప్రజలకు ఉచితంగా అందుబాటులోకి వస్తుందని అన్నారు. వైద్య కళాశాల నిర్మాణానికి అవసరమైన భూమి, నిధుల సేకరణలో జిల్లా మంత్రులు కీలక పాత్ర పోషించారని డిప్యూటీ సీఎం తెలిపారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆధ్వర్యంలో నూతనంగా 8 కొత్త వైద్య కళాశాలలు మంజూరు చేసుకొని అవసరమైన భవనాలను నిర్మిస్తున్నామని అన్నారు. గత ప్రభుత్వ హయం కంటే అధికంగా ప్రజా ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు నిధులు ఖర్చు చేస్తుందని అన్నారు. గత ప్రభుత్వం 2014 నుండి 2024 వరకు సంవత్సరానికి సరాసరి వైద్యంపై 5 వేల 959 కోట్లు ఖర్చు చేస్తే, 2024- 25 ఒక్క సంవత్సరం లోనే ప్రజా ప్రభుత్వం 11 వేల 482 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు తెలిపారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితి 5 లక్షల రూపాయల నుంచి తమ ప్రభుత్వం పది లక్షలకు పెంచిందని, దీంతో 90 లక్షల కుటుంబాలకు లబ్ధి కలిగిందని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి జిల్లాకు వైద్య కళాశాల ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ప్రజా ప్రభుత్వం వైద్యంతో పాటు విద్యకు ప్రాధాన్యత కల్పించిందని, డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్స్ చార్జిలు 200 శాతం పెంచడం జరిగిందని అన్నారు. అంతర్జాతీయ ప్రమాణాలతో 58 యంగ్ ఇండియా సమీకృత గురుకులాలను మొదటి దఫా మంజూరు చేసి 11 వేల 600 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టామని అన్నారు. 22 వేల 500 కోట్లతో రాష్ట్ర వ్యాప్తంగా 4.5 లక్షల ఇందిరమ్మ ఇండ్లను నిర్మిస్తున్నామని అన్నారు. రైతులకు రుణమాఫీ క్రింద 22 వేల కోట్ల రూపాయలు అందించామని, రైతు భరోసా క్రింద ఎకరానికి అందించే సహాయం 12 వేలకు పెంచామని, 12 వేల 500 కోట్లతో వ్యవసాయదారుల 29 లక్షల పంపు సెట్లకు ఉచిత విద్యుత్తు అందిస్తున్నామని, మహిళలకు ఆర్టిసి బస్సులో ఉచిత ప్రయాణం, 500 రూపాయల గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వంటి అనేక సంక్షేమ పథకాలు పూర్తి చేస్తున్నామని అన్నారు. సంక్షేమంతో పాటు ఖమ్మం జిల్లా ప్రజలకు సాగునీరు అందించేందుకు సీతారామ ఎత్తిపోతల పథకం పూర్తి చేస్తున్నామని, 100 కోట్లు ఖర్చు చేసి రాజీవ్ లింక్ కెనాల్ నిర్మించి నాగార్జున సాగర్ ఆయకట్టు స్థిరీకరణ చేశామని అన్నారు. ప్రజా ప్రభుత్వం 57 వేల ఉద్యోగాలను భర్తీ చేసిందని, మరో 30 వేల ఉద్యోగాల భర్తీకి కసరత్తు జరుగుతుందని, 9 వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం పథకం క్రింద స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని అన్నారు. గిరిజన కుటుంబాలకు 12 వేల 500 కోట్లతో ఇందిరా గిరిజన వికాసం పథకం క్రింద ఆర్వోఎఫ్ఆర్ పట్టాలకు సోలార్ పంప్ సెట్లు, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింకర్లను అంది స్తున్నామని అన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తూ, దుబారా ఖర్చులు చేయకుండా ఉద్యోగులకు ఒకటవ తేదీన జీతాలు ఇస్తున్నామని, ఉద్యోగస్తుల అవసరాలను కూడా ప్రభుత్వం భవిష్యత్తులో తీరుస్తుందని డీప్యూటి సీఎం తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రివర్యులు సి. దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ వైద్య రంగంలో ప్రాథమిక వైద్యం చాలా అవసరమని, ఎక్కడైనా అవసరం ఉంటే మంజూరు చేస్తున్నామని, ఖమ్మం జిల్లాలో కూడా 6 పి.హెచ్.సిలను మంజూరు చేస్తామని అన్నారు

## పెళ్లి రోజు వేళ - సుప్రభాత సేవ

శ్రీ సీతారామ చంద్ర స్వామిని దర్శించుకున్న పొంగులేటి దంపతులు

2

# నవభూమి

## జిల్లా అనుబంధం

9 మే,2025 శుక్రవారం పేజీలు:9

www.epaper.navabhoomi.in




# టేకులపల్లి మండలంలో 90 ఎకరాలకు ఎల్టీఆర్ కేసు

- గిరిజనేతరులతో రాజీ కోసం రంగంలోకి దిగిన గిరిజన ప్రజా ప్రతినిధులు
- ఎల్టీఆర్ కేసు రాజీ పడాలి లేదంటే మీ అంతు చూస్తామంటూ బెదిరింపులు

**టేకులపల్లి మే 8 నవభూమి ప్రతినిధి :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలంలోని కొప్పురాయి రెవెన్యూ గ్రామం ఒక మారుమూల ఏజెన్సీ ప్రాంతం. దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని అనేక ఏజెన్సీ గ్రామాలలాగే కొప్పురాయి ప్రాంతం కూడా నేతల దయా దాక్షిణ్యాల కోసం ఎదురు చూస్తున్నది. ఎన్నికలప్పుడు తప్ప అధికారులు, నాయకులు దృష్టి పెట్టని ఆదివాసి ప్రాంతాల్లో ఒకటి. ఈ ప్రాంతంలోకి ఎనబయ్యో దశకంలో ఆంధ్రకు చెందిన గుంటూరు ప్రాంతం నుండి అగ్ర వర్ణానికి చెందిన వారు వలస వచ్చారు. అమాయక ఆదివాసీల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని వందల ఎకరాల రెవెన్యూ భూములను వారి కబంధ హస్తాల్లోకి తీసుకున్నారు. అడిగేవారు లేకపోవడంతో మరో అగ్ర వర్ణానికి చెందిన కుటుంబాలను కూడా కొప్పురాయి ఏజెన్సీ ప్రాంతానికి ఆహ్వానించి, ఇప్పటి వరకూ సుమారు నాలుగు వందల ఎకరాల వ్యవసాయ భూములను, గిరిజన చట్టాలను ఉల్లంఘించి తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. తరతరాలుగా ఈ ప్రాంతంలోనే పుట్టి పెరిగిన ఆదివాసీలకు పట్టుమని ఐదెకరాలకు కూడా పట్టాలు లేకుండా జీవిస్తుండగా, ఎనభయ్యో దశకంలో వలస వచ్చిన రెండు అగ్రవర్ణ కుటుంబాలకు వారితో పాటు వచ్చిన వారి బంధువర్గాలకు ఒక్కొక్కళ్ళకు ఇరవై ఎకరాలకు పట్టాలు కలిగి ఉండడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. రెవెన్యూ అధికారుల సహాయంతో ఆదివాసీ చట్టాలకు తూట్లు పొడిచి, పట్టాలు పొందడమే కాకుండా అక్కడే పుట్టిపెరిగిన గిరిజనులు అడవికి వెళ్లే దారులను సైతం మూసి ఆదివాసీలపై దౌర్జనానికి దిగుతున్నారు. మామిడి, జామాయిల్ సాగు చేస్తూ కోట్ల రూపాయలు గడిస్తున్నారు. వారి స్వాధీనంలో ఉన్న భూములలో నుండి ఆదివాసీలు నడవడానికి కూడా అనుమతించని అరాచక భూస్వామ్య వ్యవస్థ కొప్పురాయి రెవెన్యూ ప్రాంతంలో వేళ్ళూనుకుంది. గిరిజనులకు చెందవలసిన వందల ఎకరాలను ఆక్రమించుకుంటూ వారిపైనే దౌర్జన్యాలకు దిగుతున్న అగ్ర వర్ణ గిరిజనేతరులపై ఆదివాసులు కన్నెర్ర చేశారు. కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయంలో ఎల్టీఆర్ కేసు నమోదు చేయాలని పదకొండు కుటుంబాలపై ఫిర్యాదు చేయడంతో అందరికీ నోటీసులు వచ్చాయి. దీంతో బెంబేలెత్తిన గిరిజనేతరులు రాజీ ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ అన్యాయపు రాజీ ప్రయత్నంలో గిరిజన ప్రజా ప్రతినిధులు, ఆదివాసి కుల పెద్దలే ప్రముఖ పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం.

**రాజీ పడాలని ఒత్తిడి చేస్తున్నారు: ఎల్టీఆర్ ఫిర్యాదు దారులు**

ఈ కేసును వాపస్ తీసుకోకపోతే గ్రామంలో కొంతమంది అధికార పార్టీకి చెందిన మా గిరిజనులను మా పైకి ఉసి గొలిపి, మమ్మలను గ్రామ బహిష్కరణ చేస్తామని అంటున్నారని కన్నీరు మున్నీరు అయ్యారు. భారత రాజ్యాంగంలో గిరిజనలకు కల్పించిన హక్కులు, చట్టాలను రక్షించాల్సిన అధికార పార్టీ నాయకులే ఈ గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ ఎల్టీఆర్ కేసు పెట్టిన గిరిజనులను భయపెడుతూ, వందలాది ఎకరాలు ఆక్రమించుకున్న గిరిజనేతరులకు గిరిజన నాయకులే వత్తాసు పలకటం తగదన్నారు. ఇది జాతి ద్రోహం అని, తల్లీ పాలు తాగి రొమ్ము గుద్దడం అంటే ఇదే అన్నారు. గిరిజన చట్టాలపై పోరాటం చేస్తున్న మాకు వీరి వల్ల ప్రాణహాని ఉందని తెలిసి కూడా పోరాడుతున్నామని, ఇది కేవలం భూపోరాటమే కాదని, గిరిజనుల ఆత్మగౌరవానికి సంబంధించిన పోరాటమని, ఇందులో తమ ప్రాణాలు సైతం పణంగా పెట్టడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. గిరిజన సంఘాలు, మేధావులు, మీడియా గిరిజనులకు అండగా ఉండాలని కోరారు.

# నేడు మిట్టపల్లికి కేటీఆర్

**బీఆర్ఎస్ నేత 'రాయల' విగ్రహావిష్కరణలో పాల్గొననున్న కేటీఆర్**
**మిట్టపల్లిలో విగ్రహావిష్కరణ సభ నిర్వహణకు నేతల ఏర్పాట్లు**

**తల్లాడ-నవభూమి:** బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్ శుక్రవారం ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లో హెలికాప్టర్ ద్వారా బయలుదేరి 11:30 గంటలకు తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి చేరుకుంటారు. మిట్టపల్లిలో డీసీఎంఎస్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు దివంగత రాయల శేషగిరిరావు కాంస్య విగ్రహాన్ని కేటీఆర్ ఆవిష్కరించనున్నారు.

అనంతరం మిట్టపల్లిలో జరిగే సభలో ప్రసంగించనున్నారు. తొలుత అంజనాపురం నుంచి మిట్టపల్లి సభా వేదిక వరకు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. దివంగత రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణ సభను విజయవంతం చేసేందుకు సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలిరానున్నారు. సభ ఏర్పాట్లను సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు గురువారం పరిశీలించారు.

# వేసవి శిబిరంలో సీడ్ బాల్స్ తయారీ





**అశ్వారావుపేట టౌన్ మే 8 నవభూమి:** అశ్వారావుపేట జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకోసం నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరంలో ప్రధానోపాధ్యాయురాలు పి హరిత ఆధ్వర్యంలో విద్యార్థులు సీడ్ బాల్స్ తయారు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చింత, టేకు, పనస, తునికి, సపోటా వంటి వివిధ రకాల విత్తనాలను సేకరించారు. వాటితో గురువారం సీడ్ బాల్స్ తయారు చేశారు. వీటిని వర్షాకాలంలో అటవీ అధికారులకు అప్పగించనున్నట్లు తెలిపారు. పాఠశాలలో నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్ లో కలుపు తీసి పాదులు తవ్వారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు హరిత మాట్లాడుతూ విద్యార్థులలో వ్యవసాయం, అటవీ సంరక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించామని ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులకు సామాజిక బాధ్యత పెంపొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కిషోర్, వెంకటేశ్వర్లు, పిఇటి రాజు, సి.ఆర్.పి ప్రభాకరాచార్యులు తదితరులు పాల్గొన్నారు.

# యువకుడి ఆత్మహత్య




**గార్ల, నవభూమి,మే 8:** మద్యానికి బానిసైన జల్సాగా తిరుగుతుండటంతో తల్లి మందలించడంతో ఆవేశానికి లోనై క్రిమిసంహారక మందు సేవించి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన గార్ల మండలం పాత పోచారం గ్రామంలో గురువారం జరిగింది. గార్ల పోలీసుల కథనం ప్రకారం పాత పోచారం గ్రామానికి చెందిన పసుపు లేటి నరేష్ (26) గత ఆరు నెలలుగా ట్రాక్టర్ డ్రైవర్ పని చేస్తూ మద్యం మత్తులో నిత్యం తూగుతూ ఉండే వాడు. దీంతో నరేష్ తల్లి మందలించడంతో ఆవేశానికి లోనై ఇంట్లో నిల్వ ఉన్న క్రిమిసంహారక మందును సేవించి స్పృహ కోల్పోయాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించడానికి ప్రయత్నాలు చేస్తుండగానే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. నరేష్ తండ్రి పసుపు లేటి రామయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రియాజ్ పాష తెలిపారు

# పెళ్లి రోజు వేళ - సుప్రభాత సేవ

■ **శ్రీ సీతారామ చంద్ర స్వామిని దర్శించుకున్న పొంగులేటి దంపతులు**





**భద్రాచలం మే 8 నవభూమి ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి - మాధురి దంపతులు భద్రాచలంలోని శ్రీ సీతారామ చంద్ర స్వామిని గురువారం దర్శించుకున్నారు. పెళ్లి రోజు సందర్భంగా ఆలయంలో స్వామివారి సుప్రభాత సేవకు హాజరయ్యారు. అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. వేద పండితులు వేద ఆశీర్వచనం ఇచ్చి గోత్ర నామాలతో పూజలు చేశారు. అనంతరం మంత్రి పొంగులేటి దంపతులు ఐటీసీ గెస్ట్ హౌస్ లో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు దంపతులు, ఆర్డీవో దామోదర్ రావు, ఆలయ ఈవో రమాదేవి, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, పోతిరెడ్డి వేంకటేశ్వర రెడ్డి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీకటి కార్తీక్ తదితరులు పాల్గొన్నారు

# మానవ వనరుల అభివృద్ధికి పకడ్బందీ చర్యలు

**(1 వ పేజీ తరువాయి)** వరంగల్, ఖమ్మం, కరీంనగర్ వైద్యపరంగా ప్రజలు హైదరాబాద్ పై ఆధార పడకుండా ఇక్కడనే సూపర్ స్పెషాలిటీ సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశ్యంతో ప్రపంచ బ్యాంకు మంజూరు చేసిన 4 వేల 100 కోట్ల నిధుల నుంచి రీజనల్ క్యాన్సర్ సెంటర్ 37 కోట్లతో వరంగల్ కు, ఆర్గన్ రిట్రీవల్ సెంటర్ ఖమ్మం జిల్లాలకు మంజూరు చేయబోతున్నామని అన్నారు. ఎన్.సి.డి. రోగుల సంఖ్య రోజు, రోజుకు పెరుగుతోందని, దీనిని అరికట్టెందుకు ప్రతి జిల్లాకు మొబైల్ క్యాన్సర్ స్క్రీనింగ్ యూనిట్ అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఖమ్మం ప్రాంతంలో వ్యాస్కులర్ యాక్సిస్ సెంటర్ ఏర్పాటు నిర్ణయం తీసుకుందని అన్నారు. ఎమర్జెన్సీ రెస్పాన్స్ టైం ను 18 నుంచి 14 నిమిషాలకు తగ్గించేందుకు నూతనంగా 213 అంబులెన్స్ ప్రారంభించామని, దీనిని 11 నిమిషాల తగ్గించే ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రత్యేకంగా ఆదివాసి మండలాల్లో 2 అంబులెన్స్ ఏర్పాటు దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఖమ్మంలో నర్సింగ్ కళాశాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. మిడ్ వైఫరీ కోర్సులు అందించేందుకు కృషి చేస్తామని, వీటి ద్వారా సి సెక్షన్ డెలీవరి తగ్గుతాయని అన్నారు. పేదల వైద్యం, విద్య పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ వహిస్తుందని అన్నారు. జీవితంలో సడన్ గా వచ్చే వైద్య ఖర్చుల నుంచి సామాన్యులకు విముక్తి కలిగించేందుకు వైద్య కళాశాలలకు అనుబంధంగా ఉన్న జనరల్ ఆసుపత్రులను బలోపేతం చేస్తున్నామని, అవసరమైన మేర మానవ వనరులు, పరికరాలు అందుబాటులో ఉంచామని అన్నారు. రాష్ట్రంలో జాతీయ, స్టేట్ రహదారులపై సుమారు 90 ట్రామా సెంటర్ లను ఏర్పాటు చేస్తున్నామని, బ్లాక్ స్పాట్ లో వద్ద ప్రతి 35 కిలోమీటర్లకు ఒక ట్రామా సెంటర్ ఏర్పాటు చేసి అవసరమైన అన్ని ఏర్పాట్లు కల్పిస్తున్నామని అన్నారు. ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత వైద్య శాఖలో సుమారు 8 వేల పోస్టులను భర్తీ చేశామని అన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్, శాసన సభ వంటి అనేక కారణాల వల్ల వైద్య కళాశాల శంకుస్థాపన ఆలస్యమైందని, నేడు వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి చేతుల మీదుగా జరగడం సంతోషకరమని అన్నారు. మానవ వనరుల అభివృద్ధి రంగాలైన విద్యా, వైద్యానికి సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యత



కల్పిస్తుందని అన్నారు. ప్రపంచంతో పోటీ పడేలా మన యువతను తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని, ఎన్ని కోట్లు ఖర్చు జరిగిన మానవ వనరుల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న రాష్ట్రంలో మెడికల్ కళాశాలలు, అనుబంధంగా నర్సింగ్ కళాశాలలు ఏర్పాటు అవుతున్నాయని, ఖమ్మం జిల్లాలో కూడా నర్సింగ్ కళాశాల మంజూరు చేయాలని మంత్రి తుమ్మల కోరారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి మరింత విస్తరించాలని, అవసరమైన వైద్య పరికరాలు సమకూర్చాలని అన్నారు. అమరావతి నాగపూర్ గ్రీన్ ఫీల్డ్ హైవే పక్కన వైద్య కళాశాల వస్తుందని, సంవత్సర కాలంలో దీని నిర్మాణ పనులు పూర్తిచేసి తరగతులు ఇక్కడినుంచి ప్రారంభిస్తామని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఖమ్మం నగరానికి మణిహారంగా ఉండే రింగ్ రోడ్డు పక్కన వైద్య కళాశాల ఏర్పాటు చేస్తున్నామని, చిన్న, చిన్న ఇబ్బందులు ఉన్నా స్థల సేకరణ చేసి వైద్య కళాశాల నిర్మాణం చేపట్టామని అన్నారు. ఆర్థికంగా ఇబ్బందులు ఉన్నప్పటికీ వైద్యం, విద్య రంగంలో ఎక్కడా ఇబ్బంది రాకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. గత ప్రభుత్వం పెట్టిన 1000 కోట్ల పెండింగ్ బకాయిలను చెల్లిస్తూ వైద్య శాఖలో నూతన ఆసుపత్రులు, వైద్య కళాశాలలు, నర్సింగ్ కళాశాలలు వంటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ పేద రైతులకు న్యాయం చేయాలనే ఉద్దేశంతో ఇక్కడ సేకరించిన భూములకు ప్రత్యామ్నాయంగా మరో చోట భూ కేటాయింపులు చేశామని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర రావు, వైద్య ఆరోగ్య శాఖ సంచాలకులు డా. నరేంద్ర కుమార్, టిజి ఎంఐడిసి ఎండి ఫణి%శీ%దర్ రెడ్డి, ఖమ్మం నగర మేయర్ నీరజ, డిసిసిబి చైర్మన్ వెంకటేశ్వర రావు, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహారా, జెడ్పి సిఇఓ దీక్షా రైనా,











ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజేశ్వర రావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారిణి డా. బి. కళావతి బాయి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకుబ్, కార్పొరేటర్లు, ప్రజా ప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ గారు..

# మణుగూరులో రైస్ మిల్లర్ల రైతుల దోపిడి కాస్త చూడరా!

- తరుగుకు ఒప్పుకుంటేనే.. ధాన్యం దింపుకొంటారంటా!
- ఒక్కసారిగా పోటెత్తడంతో ధర తగ్గింపు
- నిర్వాహకులే మధ్యవర్తులు
- మిల్లర్ల కొర్రీలు.. రైతుల వర్రీలు
- అధికారుల స్పందన కరువు


నవభూమి

ధాన్యం కొనుగోలులో ఐదు కిలోల కోత

- ఆగని రైస్ మిల్లర్ల ఆగడాలు
- రైతుల దోపిడీకి రైస్ మిల్లర్ల మధ్యవర్తులు
- అందుకే మిల్లర్లపై దాడులు నిల్
- విసిగిన రైతుకు దళారుల అండ, దండా


నవభూమి

మణుగూరులో భారీగా ధాన్యం కోత


నవభూమి

విక్రయించేందుకు వడ్లు సిద్ధం


నవభూమి

సిండికేట్‌గా మణుగూరు రైస్ మిల్లర్లు

**మల్లీడి లోకేష్ / మణుగూరు మే 8 నవభూమి ప్రతినిధి:** మణుగూరు మండలంలో రోజురోజుకి శృతి మించుతున్న రైస్ మిల్లర్ల దోపిడి. మరోవైపు కొంచెం తేమ శాతం ఎక్కువగా ఉన్నా మిల్లర్లు ధాన్యాన్ని తీసుకోవడం లేదు. తడిచిన ధాన్యాన్ని ఆరబెట్టిన తరువాత ధాన్యం రంగు మారినా తీసుకునేందుకు ససేమిరా అంటున్నారు. అలాంటి ధాన్యం లోడ్లు మిల్లులకు వస్తే నేరుగా కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైతులకు ఫోన్లు చేసి పచ్చి ధాన్యాన్ని తీసుకోబోమని తేల్చి చెబుతున్నారు. తీసుకునే పక్షంలో క్వింటాలుకు 5 నుంచి 10 కిలోల తరుగు తీయాల్సి ఉంటుందంటూ మెలిక పెడుతున్నారు.

ధాన్యం కాంటాకే ఇబ్బందులు ఎదుర్కొన్న రైతులు విధిలేని పరిస్థితుల్లో మిల్లర్లు చెప్పినట్లు వింటూ దోపిడీకి గురవుతున్నారు. ఇప్పటికైనా పౌర సరఫరాల శాఖ ఈ అంశంపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.

**ఒక్కసారిగా పోటెత్తడంతో ధర తగ్గింపు**

ప్రస్తుత వాతావరణ మార్పుల కారణంగా వర్షం పడితే ధాన్యం తడిచిపోతుందనే భయంతో రెండు రోజులుగా రైతులు ధాన్యం ట్రాక్టర్లతో మిల్లులకు పోటెత్తారు. అదే అదనుగా వివిధ రకాల కొర్రీలు పెడుతూ ధర తగ్గించేశారు. మద్దతు ధర గ్రేడ్-ఏ రకానికి (సన్న ధాన్యం) రూ.2,320గా ప్రభుత్వం నిర్ణయించింది. ఐకేపీ కేంద్రాల్లో విక్రయిస్తే క్వింటాల్కు రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 చొప్పున బోనస్ వస్తుంది. ఈ లెక్కన రైతుకు క్వింటాలు రూ.2,820 ధర లభిస్తుంది. అయితే ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో విక్రయించాలంటే రోజుల తరబడి ధాన్యాన్ని కల్లాల్లో ఆరబెట్టాల్సి వస్తుంది. ధాన్యంలో తేమ 17 శాతం వరకు ఉంటేనే ప్రభుత్వం కొనుగోలు చేయడంతోపాటు బోనస్ చెల్లిస్తుంది. ఈ క్రమంలో వర్షం పడి ధాన్యం తడిచిపోతే ఇక అంతే సంగతులు. పైగా జిల్లాలో ప్రభుత్వ పరంగా సాధారణ రకం ధాన్యం కొనుగోళ్లలోనే వేగం పుంజుకోలేదు. ఇక సన్నధాన్యం కొనుగోళ్లే ప్రారంభం కాలేదు. ఈ బాధలన్నీ పడలేక రైతులు మిల్లర్లను ఆశ్రయిస్తున్నారు.

**తరుగుకు ఒప్పుకుంటేనే.. ధాన్యం దింపుకొంటాం!**

అసలే కొనుగోళ్లు ఊపందుకోక.. కేంద్రాల నుంచి ధాన్యం రాశులు కదలక ఇబ్బందులు పడుతున్న అన్నదాతలను మిల్లర్లు నిలువునా దోచేస్తున్నారు. క్వింటా ధాన్యానికి ఐదు కిలోలకు పైగా తరుగు తీయటానికి ఒప్పుకుంటేనే ధాన్యం దింపుకొంటామంటూ మిల్లర్లు తెగేసి చెబుతుండటంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. కడుపు మండిన కర్షకులు అక్కడక్కడ మిల్లర్ల ఆగడాలను ప్రశ్నిస్తూ ఆందోళనలకు దిగుతున్నారు. రెక్కలు ముక్కలు చేసుకుని పండించిన పంటను అమ్ముకునేందుకు ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లోని వేలాది మంది రైతులకు కష్టాలు తప్పటం లేదు. పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో సేకరిస్తున్న వడ్లను ఖమ్మం జిల్లాలో 70 మిల్లులకు, భద్రాద్రి జిల్లాలో 30 మిల్లులకు కేటాయించారు.

**నిర్వాహకులే మధ్యవర్తులు..!**

జిల్లాల్లో డీఆర్డీఏ, పీఏసీఎస్, డీసీఎంఎస్, మెప్మా ఆధ్వర్యంలో ధాన్యం సేకరిస్తున్నారు. చాలాచోట్లా కేంద్రాల నిర్వాహకులే రైతుల నష్టాలకు కారకులవుతున్నారు. కాంటాలు పూర్తయిన తర్వాత కేటాయించిన మిల్లులకు ధాన్యం తరలించాలి. ఈ సమయంలో కేంద్రాల నిర్వాహకులు మిల్లర్లు, రైతులకు మధ్యవర్తులుగా ఉంటున్నారు. తేమశాతం, నాణ్యతను సాకుగా చూపి తరుగు తీస్తేనే మిల్లర్లు ధాన్యం దించుకుంటున్నారని చెప్పి రైతులకు ఒప్పిస్తున్నారు. తరుగు తీసేందుకు అంగీకరించిన రైతుల ధాన్యమే ముందుగా కాంటాలు వేస్తున్నారు. కేంద్రం వద్ద నమోదుచేసిన ట్రక్ షీట్తో సంబంధం లేకుండా తేమశాతం, నాణ్యత పేరిట మిల్లర్లు క్వింటాకు ఐదు కిలోలకుపైగా తరుగు తీస్తున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే రోజుల తరబడి రైతులకు మిల్లుల వద్ద పడిగాపులు తప్పటం లేదు. తరుగుకు అంగీకరించిన వారి వాహనాలే ముందు పెట్టి.. ఒప్పుకోని వారి వాహనాలను వెనక్కి నెడుతూ చుక్కలు చూపిస్తున్నారు. మిల్లర్ల నిర్వాకంతో రూ. వేలకు వేల నష్టం మూటగట్టుకోవాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లాలో 18,459 మెట్రిక్ టన్నులు సేకరించారు. కాంటాలు ఆలస్యమై రోజుల తరబడి కేంద్రాల్లోనే రైతులు పడిగాపులు కాస్తున్నారు. అకాల వర్షాలు, ఈదురుగాలులతో ముప్పుతిప్పలు పడుతున్నారు. ఇవి చాలవన్నట్టు మిల్లర్ల కొర్రీలు తోడవటంతో కర్షకులకు దిక్కుతోచటం లేదు.

**నిలువు దోపిడి చేస్తున్న మిల్లర్లు...**

రాష్ట్ర ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు చేయడంలో జాప్యం చేస్తూండటం వల్ల పూర్తి స్థాయిలో నాణ్యత కలిగిన వడ్లను సైతం తేమ, తాలు పేరుతో దళారులు, రైస్ మిల్లర్లు రైతుల వద్ద 40 కిలోల బస్తాపై 3 కిలోల వడ్లు ఎక్కువ తూకం వేస్తున్నారని, తద్వారా క్వింటాలుకు 7 కిలోలు అధికంగా తూకం వేస్తూ కటింగ్ చేసిన ధాన్యానికి ధర కూడా కట్టకుండా మిల్లర్లు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు, మార్కెట్ కమిటీలు, మిల్లర్లతో కుమ్మక్కై సమష్టిగా వారి ఏజెంట్ల కనుసన్నల్లో రైతులను నిలువు దోపిడీ చేస్తు దీనిని అరికట్టాల్సిన జిల్లా అధికార యంత్రాంగం సైతం దోపిడీని ప్రోత్సహిస్తోందని ప్రభుత్వం కొనుగోళ్ల పై జాప్యం చేయకుండా రైతులకు కావాల్సిన గన్ని బ్యాగులను సమకూర్చి కటింగ్ లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలని, అక్రమాలకు పాల్పడిన మిల్లర్ల పై కఠిన చర్యలు తీసుకోవాలిసిన కేంద్ర విజిలెన్స్ అధికారులు దృష్టి సరించకపోవడం లో ఆంతర్యమేమిటో కేజీకి మించి పావు కేజీ ఎక్స్ట్రా పెట్టిన మిల్లర్ల పై చర్యలు తీసుకొని మిల్లు సీజ్ చేసే బాధ్యత అధికారులకు ఉన్నది.

**అధికారుల స్పందన కరువు...**

ప్రతి సీజన్‌లో ధాన్యం రైస్ మిల్లులకు కేటాయిస్తున్నా.. బియ్యం మాత్రం తిరిగి పౌరసరఫరాల శాఖకు చేరడం లేదు. దీనిని తీవ్రంగా పరిగణించాల్సి ఉన్నా.. అధికారులు సైతం నిమ్మకు నీరెత్తినట్లుగానే వ్యవహరిస్తున్నారు. ఒక సీజన్‌లో కేటాయించిన ధాన్యానికి సంబంధించిన బియ్యం ఇచ్చిన తర్వాతే.. మరో సీజన్‌లో కేటాయించాల్సి ఉంటుంది. కానీ.. రైస్‌మిల్లులకు కేటాయించిన ధాన్యం తిరిగి ఇవ్వకపోయినా.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం చర్చనీయంగా మారింది. ఈ విషయంపై నవభూమి డిస్ట్రిక్ట్ సివిల్ సప్లై అధికారులను సంప్రదించగా సివిల్ సప్లై మేనేజర్ మాకు దృష్టికి రాలేదని దాటవేయడం జరిగింది. డిసిఓ సయ్యద్ ఖుర్షీద్ అందుబాటులోకి రాని పరిస్థితి. తద్వారా ఏ స్థాయిలో రైస్ మిల్లర్లు ఇచ్చే తాయిలాలుకు అధికారులు దాసోహం ఐయ్యారో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు... జిల్లా స్థాయిలో సివిల్స్ సప్లయ్ అధికారుల ఆగడాలు జిల్లా కలెక్టర్ కు తెలుసే జరుగుతుందా అనే అనుమానాలు రైతుల ఆక్రోశాన్నికి ఊపిరిని ఇస్తున్నాయి...

# ప్రభుత్వ ఆదాయానికి 21 కోట్లు గండికొట్టిన 'ఘనుడు'

- అనుమతులు ఒక చోట తవ్వకాలు మరొక చోట
- రాయల్టీ రికవరీకి నోటీసులు జారీ చేసిన అధికారులు
- క్వారీ హద్దులు నిర్ణయించేందుకు రెవెన్యూ,మైనింగ్ శాఖ జాయింట్ సర్వే





**జూలూరుపాడు, మే 08 (నవభూమి ప్రతినిధి)** జూలూరుపాడు మండలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా,అక్రమంగా మెటల్ క్వారీలో తవ్వకాలు జరిపి ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొట్టిన క్వారీ యజమానికి మైనింగ్ శాఖ అధికారులు 21 కోట్ల 61లక్షల 73వేల 240 రూపాయలు పెనాల్టీ విధించారు. గురువారం అక్రమ మైనింగ్ జరిగిన క్వారీలో మైనింగ్,రెవెన్యూ శాఖ అధికారులు సయుక్తంగా సర్వే నిర్వహించి మ్యాప్ ను పరిశీలించారు.అనుమతులు ఒకచోట పొంది తవ్వకాలు మరొకచోట తవ్వకాలు జరిపారన్న ఆరోపణలపై మైనింగ్ శాఖ అధికారులు విచారణ నిర్వహించారు.మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ చీమల ఆదినారాయణ,మైనింగ్ రాయల్టీ ఇన్స్పెక్టర్ పరశురాం,మైనింగ్ సర్వేయర్ పూర్ణ, మండల సర్వేయర్ ప్రవీణ్ జూలూరుపాడు గుండెపుడి రెవెన్యూ గ్రామాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు.మైనింగ్ సరిహద్దులను గుర్తించేందుకు అటవీ భూముల రక్షణకు ఫారెస్ట్ అధికారులు తవ్విన ట్రెంచ్ ఫారెస్ట్ సరిహద్దు రాళ్లను గుర్తించారు.క్వారీ యజమాని అనుమతులకు విరుద్ధంగా మైనింగ్ నిర్వహించినట్లు గుర్తించారు.క్వారీలో అధిక మొత్తంలో మెటల్ అక్రమ తవ్వకాలు జరిపిన క్వారీ యజమానికి ప్రభుత్వానికి రాయల్టీ కింద 21 కోట్ల 61 లక్షల 73 వేలు చెల్లించాలని నోటీసులు జారీ చేశారు. క్వారీ యజమాని స్పందించకపోవడంతో ప్రభుత్వానికి రావలసిన రాయల్టీని రికవరీ చేసేందుకు రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా తహసిల్దార్ స్వాతి బిందు అనుమతులు పొందిన క్వారీ నిర్వాహకునికి గతంలో నోటీసులు అందజేశారు.

ఖచ్చితమైన సరిహద్దులను నిర్ణయించేందుకు మైనింగ్ రెవెన్యూ శాఖ అధికారులు సంయుక్తంగా సర్వేను నిర్వహించారు.జాయింట్ సర్వే పై తహసిల్దార్ స్వాతి బిందు వివరణ కోరగా జిల్లా ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు క్వారీ యజమానికి రెవెన్యూ రికవరీ యాక్ట్ ద్వారా నోటీసులు జారీ చేశామన్నారు.ప్రస్తుతం నిర్వహిస్తున్న క్వారీలో హద్దులు నిర్ణయించేందుకు రెవెన్యూ మైనింగ్ శాఖ జాయింట్ సర్వే నిర్వహించామని తెలిపారు.నివేదికను ఉన్నత అధికారులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది రాములు,రామారావు పాల్గొన్నారు.

## షార్ట్ సర్క్యూట్‌తో ఎద్దు మృతి



**గుండాల మే 8 నవభూమి:** గుండాల కు చెందిన గడ్డం శ్రీను ఎద్దు షార్ట్ సర్క్యూట్ తో మృతి చెందింది. రూ. 50వేలు విలువ చేసే ఎద్దు మృతి చెందడంతో వ్యవసాయ పనులు దగ్గర పడటంతో గడ్డం శ్రీను ఆవేదన చెందారు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని కోరారు. పశు వైద్య అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని పంచనామా చేశారు

## టీజీ ఆర్జెసి సెట్ పరీక్ష కేంద్రాల వద్ద సెక్షన్ 163 బిఎన్ఎన్ఎస్ సెక్షన్ అమలు

### పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీస్ బందోబస్తు, పరిసరాలలో పోలీస్ పెట్రోలింగ్ పోలీస్ కమిషనర్ సునీల్ దత్



**ఖమ్మం, క్రైం, నవభూమి, మే 8:** ఈనెల 10 వ తేదిన ఖమ్మం కమిషనరేట్ పరిధిలో 27 పరీక్ష కేంద్రాలలో నిర్వహించే టీజీ ఆర్జెసి సెట్ పరీక్ష సందర్భంగా అయా పరీక్ష కేంద్రాల వద్ద ఉదయం 8:00 గంటల నుండి మధ్యాహ్నం 2:30 వరకు సెక్షన్ 163 బి ఎన్ ఎన్ ఎస్ యాక్ట్ -2023 (భారతీయ నాగరిక్ సురక్షా సంహిత) అమలులో వుంటుందని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నేపథ్యంలో పరీక్ష కేంద్రాలకు 200 మీటర్ల దూరం వరకు ఐదుగురికి మించి గుంపులుగా వుండరాదని సూచించారు. అదేవిధంగా ఏలాంటి సభలు, సమావేశాలు, ర్యాలీలకు, మైకులు, డిజేలతో ఊరేగింపులు, దర్నాలు, ప్రచారాలు నిర్వహించరాదని పెర్కొన్నారు. పరీక్ష సమయంలో పరిసరాలలోని ఇంటర్నెట్ సెంటర్స్, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలు మూసివేయాలని సూచించారు. పరిక్ష సమయంలో ఎటువంటి ఆటంకాలు జరగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా 163 సెక్షన్ అమలు చేస్తున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ నేపథ్యంలో వివిధ వర్గాల ప్రజలు, రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. అదేవిధంగా పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తు తో పాటు ట్రాఫిక్ అంతరాయం కలగకుండా ట్రాఫిక్ పోలీసులు పకడ్బంది చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాలలో పోలీస్ పెట్రోలింగ్ పార్టీలను నియమించినట్లు తెలిపారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసేందుకు నిఘాను నియమించి సమాచారం సేకరించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలున తీసుకోవడం జరుగుతుందని తెలిపారు

## ఆపరేషన్ సింధూర్ పట్ల డాక్టర్ నయీామ్ ఖురేషి హర్షం



**కొత్తగూడెం మే 8 నవభూమి ప్రతినిధి:** ఉగ్రవాద నిర్మూలన లక్ష్యంగా దేశ భద్రత కోసం ప్రాణాలు తెగించి పోరాడుతున్న భారత త్రివిధ దళాలు ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్, ధైర్య సాహసలను ఎప్పటికీ మరువలేమని కాంగ్రెస్ రాష్ట్ర మైనార్టీ నాయకులు డాక్టర్ నయీామ్ ఖురేషి అన్నారు. ఓల్డ్ డిపో వద్ద తన కార్యాలయంలో గురువారం ఖురేషి మాట్లాడుతూ కాశ్మీర్ పహాల్గంలోని ఉగ్రదాడిని దేశ ప్రజలు ఐక్యమత్యంతో కలిసికట్టుగా ఖండించారని, దేశంలోని ఉగ్రవాదులకు చోటు లేకుండా చేయాలనే ప్రజల ఆకాంక్షను సింధూర్ ఆపరేషన్ భాగంగా ఆర్మీ, నేవీ, ఎయిర్ఫోర్స్ కలిసి విజయవంతం చేసిన సింధూర్ ఆపరేషన్ విజయవంతం అయిన సందర్భంగా నయీామ్ ఖురేషి హర్షం వ్యక్తం చేస్తూ ఆర్మీలో ప్రస్తుతం వింగ్ కమాండర్ హొదాలో పని చేస్తున్న సోఫియా ఖురేషి తను ఖురేషి కమ్యూనిటీ నుండి కర్నాల్ స్థాయిలో దేశ భద్రత ఉన్నత స్థానంలో ఉండటం చాలా గర్వకారణమని పేర్కొన్నారు

## పాలేరు నియోజకవర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నేత నరేష్ రెడ్డి







**తిరుమలాయపాలెం నవభూమి మే 8-** కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు బీరోలు సొసైటీ చైర్మన్ రామసహాయం నరేష్ రెడ్డి బుధవారం పాలేరు నియోజకవర్గంలోని ఖమ్మంలో తిరుమలయపాలెం మండలాల్లో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు మేడిద పల్లి గ్రామానికి చెందిన ఎస్కే పాషా నిశ్చితార్థ వేడుకలు కమ్మ రూరల్ మండలం ఆరంపల గ్రామంలో జరగగా ఆ కార్యక్రమంలో పాల్గొని పా షను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు విజయపాల్ రెడ్డి సుమన్ రెడ్డి చంద్రారెడ్డి సాగర్ తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా తిరుమలాయపాలెం మండలం కేశవాపురం గ్రామంలో స్వాతంత్ర సమరయోధురాలు ఉన్నం భారతమ్మ దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళు లర్పించారు గ్రామ అభివృద్ధికి ఉన్న వీరయ్య భారతమ్మ చేసిన సేవలు మరువలేనివని అని వారి సేవలను గుర్తు చేసుకున్నారు వారి అడుగుజాడల్లో పయనిస్తూ గ్రామ అభివృద్ధికి విచ్చేయాలని గ్రామస్తులను కోరారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సురేందర్ శ్రీనివాస్ రవికాంత్ రెడ్డి నరేష్ రాంబాబు ఉప్పయ్య నరసయ్య తదితరులు పాల్గొన్నారు. మేడిద పల్లి గ్రామంలో మోరా కోటిరెడ్డి దశదిన కార్యక్రమంలో పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ కార్యక్రమంలో రవికాంత్ రెడ్డి చంద్రారెడ్డి సాగర్ సుమన్ రెడ్డి విజయపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

## బెతెస్త ప్రార్ధన మందిరంలో అంబరాన్నంటిన విబిఎస్ సంబరాలు

- **మానసిక ఉత్తేజాన్ని పెంపొందించే స్కిట్లు, బోధనలు, డాన్సులు**





**అశ్వాపురం మే 8 నవభూమి:** అశ్వాపురం మండలం చింతిర్యాల క్రాస్ రోడ్ లోని బేతెస్త ప్రార్ధనా మందిరములో పాస్టర్ కృపాకర్ ఆధ్వర్యంలో గత నాలుగు రోజుల నుండి విరామ బైబిల్ స్కూల్ (విబిఎస్) తరగతులు నిర్వహించబడ్డాయి. ప్రతి రోజు సుమారు రెండు వందలకు పైగా చిన్నారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, దైవిక జ్ఞానం పెంపోందించే బోధనలు, మానసిక ఉత్తేజాన్ని పెంపోందించే స్కిట్లుతో చిన్నారులు అలరించారు. ఈ నాలుగు రోజులు చిన్నారులతో బేతెస్త ప్రార్ధన మందిరంలో సంబరాలు ఘనంగా జరిగాయి. జరిగిన నాలుగు రోజులు సుమారుగా 200 పైన చిన్నారులకు, స్నాక్స్, జ్యూసులు, భోజన సదుపాయాలు అందించి చిన్నారులకు ఎటువంటి లోటు లేకుండా దగ్గరుండి అన్ని సదుపాయాలు పాస్టర్ కృపాకర్ అండ్ టీం దగ్గరుండి చూసుకున్నారు. చివరి రోజు ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు చిన్నారులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి చిన్నారులకు సర్టిఫికెట్స్, గిఫ్ట్స్ అందజేశారు. ఈ కార్యక్రమం విజయవంతంగా జరగడానికి టీచర్స్ గా మెర్సీ, రంజిత, శిల్ప, హెలెన్, రత్నశ్రీ, దీపా ఫ్లారెన్స్ కు పాస్టర్ కృపాకర్ కృతజ్ఞతలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో సంతపురి సతీష్, గొల్లపల్లి నరేష్ కుమార్ పాల్గొన్నారు

## సంస్థాగత నిర్మాణంపై దృష్టి పెట్టిన తెలుగుదేశం పార్టీ



**అన్నపురెడ్డిపల్లి మే 8 నవభూమి:** అశ్వారావుపేట నియోజకవర్గంలో టిడిపి పార్టీ నూతన గ్రామ కమిటీలను నియామకం చేస్తున్నట్లు నియోజకవర్గ ఇంచార్జ్ కట్రం స్వామి దొర ప్రకటనలో తెలిపారు. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి కొత్త గ్రామ కమిటీలను నియమించుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు. అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీ మండల పార్టీ అధ్యక్షులు పానుగంటి రామారావు ఆధ్వర్యంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నూతన కమిటీలు పార్టీ ఏర్పాటు చేసి బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. అన్నపురెడ్డిపల్లి గ్రామ అధ్యక్షులుగా పఠాన్ నాగులు మీరా, ఉపాధ్యక్షులుగా లకావత్ వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా చింతల పాపారావు, ప్రచార కార్యదర్శిగా పలగాని చెన్నారావు, ట్రెజరర్ గా బుద్ధి పువ్వు అంజి, కార్యవర్గ సభ్యులుగా మల్లెల స్వామి, బొప్పి పాపారావు, బడుగు లక్ష్మయ్య, రంజాన్ బాలస్వామి, జవ్వాజి భద్రం, బత్తుల వెంకటరావు, షేక్ లాలా మధు ఎన్నుకోవడం జరిగింది.

# జిల్లా సమస్యలపై కలెక్టర్ వినతి పత్రం సమర్పించిన బీజేపీ

**కొత్తగూడెం మే 8 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా లో అనేక సమస్యలపై బీజేపీ ఐదు నియోజకవర్గ నేతలు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జితేష్ వి పాటిల్ కు గురువారం వినతి పత్రం సమర్పించారు. అనంతరం నాయకులు మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేదల కోసం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో జిల్లాలో కేవలం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ది దారుల లిస్ట్ లో చేర్చిన ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు, నిజమైన అర్హులకు మొండి చేయి చూపారని ఫిర్యాదు చేశారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ ఇందిరమ్మ ఇళ్ళ కమిటీలు ఎంపిక చేసే లబ్ధిదారుల లిస్ట్ పై పూర్తి దర్యాప్తు చేసి నిజమైన పేదలకే ఇల్లులు మంజూరు చెయ్యాలన్నారు. లబ్ధిదారుల ఎంపిక కూడ ప్రజల సమక్షంలోనే జరగాలన్నారు. అదేవిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సుమారు రెండు లక్షల ఇరవై వేల మంది రైతులు ఉంటే కేవలం యాభై వేల మంది రైతులకే రుణ మాఫీ అయిందని, ఇంకా మిగిలిన లక్ష ఎనభై వెల మంది రైతులకు తక్షణమే రుణ మాఫీ చెయ్యాలని, రైతు బీమా, రైతు భరోసా, వ్యవసాయ భూముల పట్టా పహాణీల సమస్యలు కూడ పరిష్కరించాలన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయితీలో సర్పంచ్ లు లేని కారణంగా పాలన పూర్తిగా స్తంభించి పోయినదని, ఫలితంగా గ్రామాల్లో పారిశుధ్య పనులు అభివృద్ధి పనులు మంచినీటి సమస్య ఇలా అనేక సమస్యలు ఉన్నాయని, వీటన్నిటి మీద ప్రేత్యేక దృష్టి సారించాలన్నారు. రాజీవ్ యువ వికాస పథకంలో సిబిల్ స్కోర్ తో సంబంధం లేకుండా చదువుకున్న ప్రతి నిరుద్యోగికి రుణం మంజూరు చెయ్యాలని అన్నారు. జిల్లాలో ఉన్న సీతారామ ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపించాలని, మిగిలిన పనులు వెంటనే చేసి రైతులకు నీళ్లు ఇవ్వాలని అన్నారు. ఈ మధ్య కాలంలో కురిసిన అకాల వర్షం



కారణంగా నష్టపోయిన మామిడి రైతులకు, వరి రైతులకు నష్టంపై అంచనా వేసి తక్షణమే నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలని అన్నారు. జిల్లాలో ఉన్న పామాయిల్ రైతులకు పహాణి ద్వారా డ్రిప్ సబ్సిడీ ఇవ్వాలని అన్నారు. ఈ కార్యక్రమం బీజేపీ జిల్లా మాజీ కన్వీనర్ నాళ్ల సోమసుందర్, ముస్కు శ్రీనివాస రెడ్డి,(మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్), పోడియం బాలరాజు, తాటిపాముల ఐలయ్య (జిల్లా ప్రధాన కార్యదర్శి) గొట్టెపొల్ల శ్రీనివాస్ (అశ్వారావు పేట నియోజకవర్గ కన్వీనర్), బుడగం రవి (ఖమ్మం పార్లమెంట్ కో కన్వీనర్), యెడ్లపల్లి శ్రీనివాస కుమార్ (మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి), భూక్యా సీతారాం నాయక్ (మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి, పొనిశెట్టి వెంకటేశ్వర్లు (బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి), డి. రమేష్ బాబు (దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు), రాజు (జిల్లా కౌన్సిల్ మెంబెర్),దాసరి రమేష్,మాదారపు లక్ష్మణ్, బి వీరన్న, జి. రాజు, సురేందర్ లు పాల్గొన్నారు

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి

■ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు

**బూర్గంపాడు మే 8 నవభూమి:** దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె మే 20న జయప్రదం చేయాలని బూర్గంపాడు మండలం చెరువు సింగారం ప్రాంతంలో ఉపాధి పని చేస్తున్న ఉపాధి కార్మికుల్ని సందర్శించడం జరిగింది. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు వారితో మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపైన భారాలు మోపుతూ ప్రజలకున్న హక్కులని ప్రైవేటు వ్యక్తులకి అప్ప జెప్పడం, ప్రభుత్వం ఆస్తులని కొందరికి అప్పనంగా ఇవ్వటం, సామాన్య ప్రజలపైన నిత్యవసర సరుకులు కొనలేని పరిస్థితి, ఉపాధి కార్మికులకు కొలతలు లేకుండా డబ్బులు ఇవ్వాలని 600 రూపాయలు రోజు కూలి ఇవ్వాలని రెండు వందల రోజులు పని దినాలు కల్పించాలని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పని చట్టాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉపాధి కార్మికుల పైన ఉందని, కేంద్ర ప్రభుత్వం ఉపాధి చట్టాన్ని దుర్వినియోగం చేయాలని, నిధులు బడ్జెట్లో కేటాయించలేదని పని భారాన్ని పెంచటం మూడు ఫోటోలు పేరుతో ఉపాధి కార్మికుల్ని ఇబ్బంది పెట్టడం,



అనేక విషయాలు పైన సార్వత్రిక సమ్మె మే 20న జరిగే సమ్మెకు ఉపాధి కార్మికులు కూడా పాల్గొని జయప్రదం చేయాలని నినాదాలు ఇస్తూ ఉపాధి హక్కుని కార్మిక చట్టాలనే కాపాడుకుందామని నాలుగు లేబర్ కోడ్ల రద్దు చేయాలని కార్మిక చట్టాలని రక్షించుకోవాలని పిలుపునిచ్చారు, ఈ కార్యక్రమంలో కుర్స సత్యనారాయణ, కనితి శంకర్, భీమయ్య, జోగారావు, ఇర్ప సీతమ్మ, మహేశ్వరి, మేకల నారాయణ, కుర్సు గణేష్, కనితి కృష్ణమూర్తి, కారం అర్జున్ రావు, కారం సీతమ్మ, మిరియాల చిట్టిమ్మ, పాల్గొన్నారు

# గుండాలలో పోలీసుల ఆధ్వర్యంలో క్రీడలు






**గుండాల మే 8 నవభూమి:** గుండాల మండల వాలీబాల్ టోర్నమెంట్ ను గురువారం ఇల్లందు డిఎస్పి ఎన్ చంద్రబాను ప్రారంభించారు. డీఎస్పీ మాట్లాడుతూ క్రీడలు ఫిజికల్ ఫిట్నెస్ తో పాటు మెంటల్ గా కూడా ఫిట్ గా ఉండేటట్లు చేస్తాయని, క్రీడలు మన దైనందిక చర్యల్లో భాగంగా చేసుకోవాలని, ఏజెన్సీ ప్రాంతంలో యువత ఎక్కువగా వాలీబాల్ క్రీడలు ఆడుతారు కాబట్టి జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఆదేశాల మేరకు వాలీబాల్ టోర్నమెంట్ ని గుండాల, ఆళ్లపల్లి, కోమరారం పీఎస్ పరిధిలోని యువత కొరకు గుండాల పోలీసు వారు ఈ టోర్నమెంటును ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపినారు. యువత చెడు అలవాట్లకు లోను కాకుండా క్రీడలపై దృష్టి పెట్టాలని తెలిపారు. ఈరోజు వాలీబాల్ టోర్నమెంట్లో మొత్తం 30 జట్లు పాల్గొన్నాయని తెలిపినారు. గుండాల సీఐ రవీందర్ మాట్లాడుతూ క్రీడల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఆరోగ్యంగా ఉంటారని, చెడు అలవాట్లుకు కూడా దూరంగా ఉంటారని తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో గుండాల ఎస్ఐ సైదా రవూఫ్, కొమరారం ఎస్సై పటాన్ నాగుల్ మీరా ఖాన్, మండల వ్యాపారస్తులు, ప్రజలు, యువత పాల్గొన్నారు.

## జర్నలిస్ట్ అర్వపల్లి నగేష్‌ను పరామర్శించిన డబ్ల్యూజెఐ ప్రతినిధులు



**ఖమ్మం మే 8 నవభూమి ప్రతినిధి:** ఖమ్మం పట్టణంలోని ఆరోగ్య ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న జర్నలిస్ట్ నగేష్‌ను వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజెఐ) యూనియన్ నాయకులు పరామర్శించారు. ఖమ్మం జిల్లా వాయిస్ అఫ్ వర్డ్స్ స్థాఫర్ గా పనిచేస్తున్న అర్వపల్లి నగేష్ గత కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యారు. ఆరోగ్య ఆసుపత్రి నందు సర్జరీ జరిగిన అనంతరం యూనియన్ నేతలు నగేష్ ను కలిసి భరోసా ఇచ్చారు. యూనియన్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు . జర్నలిస్టుల ఆరోగ్యంపై ప్రభుత్వం సవతి తల్లి ప్రేమ చూపిస్తుందని యూనియన్ స్టేట్ సెక్రటరీ ఎన్ ఎస్ రావు అన్నారు. జర్నలిస్టుల హెల్త్ కార్డులు పేరుకే పరిమితం అయ్యాయని తెలిపారు. ఖమ్మం జిల్లా కేంద్రంలో ప్రధాన ఆసుపత్రిలలో హెల్త్ కార్డు అమలయ్యే విధంగా స్థానిక మంత్రి చొరవ చూపాలని కోరారు. ఖమ్మం జిల్లా కన్వినర్ బాచిమంచి రమేష్, ఓరుగంటి కిరణ్ కుమార్, హరీష్ రెడ్డి తదితరులు జర్నలిస్టు నగేష్ ను పరామర్శించిన వారిలో ఉన్నారు.

## సార్వత్రిక సమ్మెలో భాగస్వాములు కావాలి



**గార్ల, నవభూమి,మే 8:** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఈనెల 20 వ తేదీ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె లో సంఘటిత, అసంఘటిత కార్మికులు భాగస్వామ్యం కావాలని వ్యవసాయ కార్మిక సంఘం మహబూబాబాద్ జిల్లా నాయకుడు వి. వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. గార్ల మండలం పినిరెడ్డి గూడెం సమీపంలోని ఊరు కుంటలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల ప్రాంతంలో సిపిఎం పార్టీ కార్యకర్తలు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతుందని, కార్మిక సంఘాల హక్కు లను హరించేందుకు నాలుగు లేబర్ కోడ్ లను తీసుకొస్తుందని, ఎనిమిది గంటల పని విధానాలను రద్దు పరిచి 12 గంటల పని విధానాన్ని అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. ఇందుకు విరుద్ధంగా జరుగనున్న సమ్మె లో సంఘాలకు అతీతంగా కార్మికులు పాలుపంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు నాగమణి, ఎల్లయ్య, కొండయ్య, పద్మ, తదితరులు పాల్గొన్నారు

## భారత నారీ శక్తి దేశానికి గర్వకారణం

**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, మే 8:** భారత నారీశక్తిని లోకానికి చాటి చెప్పడం గర్వంగా ఉందని శేరిలింగంపల్లి నియోజకవర్గం మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు చంద్రిక ప్రసాద్ అన్నారు. ఇద్దరు మహిళా అధికారులు శత్రుసంహారం కోసం బరిలో దిగి పాకిస్తాన్ లోని 9 ఉగ్రవాదుల స్థావరాలను నేలమట్టం చేసినందుకు ఒక మహిళగా గర్విస్తున్నానని పేర్కొన్నారు. భారతీయ మహిళల శక్తి ఏంటో మరోసారి నిరూపించడం జరిగిందని తెలిపారు

## స్వాతంత్ర సమరయోధురాలు ఉన్నం భారతమ్మ చిత్రపటానికి నివాళులర్పించిన పలువురు ప్రముఖులు



**తిరుమలాయపాలెం నవభూమి మే 8-** తిరుమలాయపాలెం మండల పరిధిలోని కేశ్వపురం గ్రామానికి చెందిన ఉన్నం భారతమ్మ ఇటీవల మృతి చెందగా వారి దశ దిన కర్మ సందర్భంగా భారతమ్మ. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించిన తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్ సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ సిపిఎం జిల్లా కార్యదర్శి నున్న నాగేశ్వరరావు సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు భూక్య వీరభద్రం సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు కమ్మ కోమటి నాగేశ్వరరావు రాయల రాజా యడ్లపల్లి నవీన్ తెట్టెలపాడుగ్రామ మాజీ సర్పంచ్ పూసులూరి నరేందర్ మాజీ జెడ్పిటిసి సభ్యులు బెల్లం శ్రీనివాస్ మాజీ ఎంపీపీ కొప్పుల అశోక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నం రాజశేఖర్ షేక్.కరీం. జోగులపాడు మాజీ సర్పంచ్ నల్లబెల్లి లింగన్న .సుదర్శన్ తాత రవీందర్ చామకూరు రాజు పరికపల్లి చంద్రశేఖర్ బోడ మంచ నాయక్ జక్కుల వీరన్న వీరెల్లి నవీన్ ఏట్యూరు వంశీ తదితరులు పాల్గొన్నారు

## వధూవరులను ఆశీర్వదించిన కూనంనేని



**చింతకాని, నవభూమి, మే 8:** బస్వాపురం మాజీ ఎంపీటీసీ మార్గం కొరివీరమ్మ- శ్రీనివాసరావు దంపతుల కుమారుడు వేణు-అఖిల దంపతుల వివాహానికి గురువారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వధించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, కొండవర్తి గోవిందరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సింగు నర్సింహారావు, మండల కార్యదర్శి పావులూరి మల్లికార్జునరావు, వ్యకాన జిల్లా అధ్యక్షుడు తాటి వెంకటేశ్వర్లు, జిల్లా సమితి సభ్యులు కూచివుడి రవి, తాటి నిర్మల, రాసాల మోహన్రావు, దూసరి గోపాలరావు, అబ్బూరి మహేష్, దొబ్బల వెంగళరావు, కొల్లి రవి, మాజీ ఎంపీపీ కన్నెబోయిన విజయమ్మ, బొడ్డు కొండలరావు, ఆవుల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు. అనంతరం బస్వాపురం గ్రామానికి చెందిన సీపీఐ కార్యకర్తలు మామిడాల యాలాద్రి, చేబోలు రవి కి ఇటీవల యాక్సిడెంట్ అవ్వగా వారిని పరామర్శించి త్వరలో కొలుకోవాలని ఆకాంక్షించారు.

## భద్రాచలంలో కొబ్బరి చెట్టుపై పిడుగుపాటు



**భద్రాచలం మే 8 నవభూమి ప్రతినిధి:** భద్రాచలం పట్టణంలో గురువారం సాయంత్రం భారీ వర్షం. పిడుగుపాటుకు చర్ల రోడ్ లో ద్విచక్ర వాహనం షోరూమ్ వెనక గల ఇంటి ఆవరణలో కొబ్బరి చెట్టుపై పిడుగు పడటంతో మంటలు ఎగిసిపడ్డాయి. పిడుగు పడినప్పుడు అక్కడి స్థానికులు భయాందోళన కు గురయ్యారు. ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగక పోవడంతో అక్కడి స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు

# ఇసుక ఓవర్ లోడ్ రైట్ రైట్

- పెద్ద ఎత్తున చేతుల మారుతున్న కాసులు
- చెక్ పోస్ట్ వద్ద కాట ఉన్నా తూకం వేయడం లేదు










**కొత్తగూడెం మే 8 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రభుత్వ ఇసుక రాంపుల్లో జోరుగా అక్రమాలు చోటు చేసుకుంటున్నాయి. మైనింగ్ అధికారులు సైతం ఈ అక్రమాల పై చూసి చూడనట్టు వదిలేస్తున్నారు. రాంపుల్లో ఉన్న టీ ఎస్ ఎం డి సి అధికారుల కనుసన్నల్లోనే అక్రమాలు జోరుగా సాగుతున్నాయి. ఈ అక్రమాలు అరికట్టెందుకు పాల్వంచ మండలం నాగారం వద్ద ఏర్పాటు చేసిన మైనింగ్ శాఖ చెకపోస్ట్ సైతం నామ్ కే వాస్తే మారింది. రాంపుల్లో లేదా బయట ఉన్న కాంటా ల్లో మేనేజ్ చేసి తూకం తక్కువ వేయించుకుని వస్తున్నారు. ఒక్కొక్క లారీలో మూడు నుండి అయిదు టన్నుల వరకు అధికంగా ఐసుక లోడ్ చేసి రాంప్ నుండి పంపుతున్నారు. అయితే రాంప్ కాటాలో లేదా రాంప్ సమీపంలోని బయట కాటాలో పాసింగ్ కు ఎంత తూకం ఉండాలో అంతే ప్రింట్ చేసి పంపుతున్నారు. వీటిని అరికట్టేందుకు నాగారం వద్ద మైనింగ్ శాఖ ఒక చెక్ పోస్ట్ ఏర్పాటు చేసింది. అక్కడ పక్కనే ఒక వే బ్రిడ్జి ఉంది.అందులో తూకం మేనేజ్ చేయడం వీలు కాదు.ఎంత తూకం ఉంటే అంతే బిల్లు ప్రింట్ లో వస్తుంది. ప్రతి లారీని ఈ కాటలో తూకం వేసి పంపితే ఈ అక్రమాలు బయట పడతాయి. బుధవారం మూడు లారీలు ఈ వే బ్రిడ్జిలో తూకం వేస్తె ఇసుక అధికంగా ఉంది. అయిన కొందరు బేరసారాలకు దిగారు. ఈ విషయం జిల్లా బాస్ కు చేరటంతో లారీలు పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్ కు తరలించారు. గురువారం కూడా ఒక లారీ తూకం వేస్తె దాదాపు మూడున్నర టన్నులు ఇసుక లోడ్ ఎక్కువగా ఉంది.ఇలా రోజు వందలటన్నుల ఇసుక అక్రమంగా తరలిపోతోంది. ప్రభుత్వ ఖజానాకు పెద్ద ఎత్తున గండి పడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం మేల్కొని ఇలా అక్రమ లోడింగ్ అరికట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# పాల్వంచ పెద్దమ్మ తల్లిని దర్శించుకున్న రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి







**పాల్వంచ టౌన్ మే 8 నవభూమి ప్రతినిధి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం, కేశ్వాపురం - జగన్నాధపురం గ్రామంలో వెలిసియున్న శ్రీ కనకదుర్గ దేవస్థానం ( పెద్దమ్మ గుడి)లో గురువారం తెలంగాణ రాష్ట్ర సమాచార, రెవెన్యూ, హౌసింగ్ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కుటుంబ సమేతంగా శ్రీ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన సాంప్రదాయం ప్రకారం వేద పండితులు, అర్చకులు, దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజనీకుమారి, పాలకమండలి ధర్మకర్తలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వీరికి పూజల అనంతరం అర్చకులు ఆశీర్వచనం ఇవ్వగా దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, శ్రీ అమ్మవారి శేష వస్త్ర ప్రసాదంను అందించారు. వీరి వెంట పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ సుకృత అమ్మవారిని దర్శించుకొని పూజలో పాల్గొన్నారు.

**పెద్దమ్మ తల్లికి ఘనంగా సువర్ణ పుష్పార్చన**

శ్రీ కనకదుర్గ దేవస్థానం( పెద్దమ్మ గుడి) లో గురువారం పురస్కరించుకొని అమ్మవారికి 108 సువర్ణ పుష్పములతో వైభవంగా సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఇందులో భాగంగా అమ్మవారికి హారతి, మంత్రపుష్పం, నివేదన తదితర ప్రత్యేక పూజలు అర్చకులచే నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మవారిని దర్శించి తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎన్. రజినీకుమారి, పాలక మండలి చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, ధర్మకర్తలు చీకటి కార్తీక్, పెండ్లి రామిరెడ్డి, భూక్య గిరి ప్రసాద్, చెవు గాని పాపారావు, చెరుకూరి శేఖర్ బాబు, ధర్మరాజుల నాగేశ్వరరావు, శనిగారపు శ్రీనివాసరావు, దుగ్గిరాల సుధాకర్ సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

**ఈనెల 10న ఆలయంలో శని త్రయోదశి సందర్భంగా శని శ్వరునికి తైలాభిషేకం**

శని త్రయోదశి సందర్భంగా ఈనెల 10న శనివారం రోజున శనిశ్వరుడిని తైలాభిషేకం ఉదయం 9:00 గంటల నుండి నిర్వహించనున్నారు. జన్మ నక్షత్ర, నామ దోషములు ఉన్నవారు శని శ్వరునికి తైలాభిషేకం చేయడం ద్వారా దోషములు తొలగిపోయి ఆయురారోగ్య అష్టైశ్వర్యాలను కలుగుతాయని,ఈ పూజ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నాలన్నారు.

## పూసుకుంట రోడ్డు పనులు పరిశీలించిన ఎమ్మెల్యే జారె



**కొత్తగూడెం మే 8 నవభూమి:** దమ్మపేట, ములకలపల్లి మండలాల్లో పర్యటించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ. ముందుగా దమ్మపేట మండలంలో గురువారం పూసుకుంట, కట్కూరు గిరిజన గ్రామాలను కనెక్టివిటీ కోసం ముమ్మరంగా జరుగుతున్న బీటీ రహదారి పనులు పరిశీలించారు. అనంతరం ములకలపల్లి మండలం జగన్నాథపురం గ్రామంలో సురభి వారి వివాహ వేడుక, ములకలపల్లిలో చిట్టిబొమ్మ వారి వివాహ వేడుకలలో పాల్గొని నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం వారి చేతులతో షన్మి శ్రీ మెడికల్, జిరాక్స్ నూతన షాప్ ప్రారంభించారు. దమ్మపేట మండలం బాలరాజుగూడెం గ్రామంలో ఎమ్మెల్యే మిత్రులు కల్లూరి వెంకటేశ్వర్లు ప్రధమ వర్ధంతి కార్యక్రమంలో పాల్గొని వారి చిత్రపటానికి పూలు వేసి నివాళి అర్పించారు.

## కేటీఆర్ పర్యటనను విజయవంతం చేయండి

### బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు



**జూలురుపాడు,మే 08 (నవభూమి ప్రతినిధి)-** భారత రాష్ట్ర సమితి కార్య నిర్వాహక అధ్యక్షులు మాజీ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు (కేటీఆర్) జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా బి ఆర్ ఎస్ పార్టీ అధికార ప్రతినిధి, వైరా నియోజక వర్గ ముఖ్య నాయకులు లకావత్ గిరిబాబు గురువారం ఒక ప్రకటనలో పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఖమ్మం జిల్లా తల్లాడ మండలం మిట్టపల్లి గ్రామానికి రానున్నట్లు తెలిపారు. మిట్టపల్లి గ్రామంలో మాజీ డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు విగ్రహావిష్కరణ కార్యక్రమానికి హాజరవుతారని అనంతరం జరిగే భారీ బహిరంగ సభలో పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైరా నియోజక వర్గ బి ఆర్ ఎస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని జయ ప్రదం చేయాలని కోరారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రి పొంగులేటి

**ఖమ్మం రూరల్, నవభూమి, మే 8:** మండలంలోని ఏదులాపురం మున్సిపాలిటీ పరిదిలో గల గుదిమల్ల గ్రామానికి చెందిన చెరుకుపల్లి మంగతాయారు, సైదులు కుమారుడు శ్రీకాంత్ వివాహానికి రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం హజరై నూతన వధూవరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారికి నూతన వస్త్రాలను బహుకరించారు. ఈకార్యక్రమంలో గుదిమల్ల గ్రామం శీనన్న అభిమానులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



# సీతారామ ప్రాజెక్టు భారీగా నిధుల దుర్వినియోగం

**గార్ల, నవభూమి,మే 8:** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ రీ డిజైన్, రీ ఇంజనీరింగ్ తో ఈ ప్రాజెక్ట్ మరో కాళేశ్వరం ప్రాజెక్టుగా మారిందని తెలంగాణ విద్యా వంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జంపాల విశ్వ ఆరోపించారు. తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రమైన గార్ల లోని అంబేద్కర్ భవన్లో సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుపై రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతున్న సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ మొదటి నిర్దేశిత ప్రాంతాలైనా ఇల్లందు, మహబూబాబాద్, డోర్నకల్ నియోజక వర్గ ప్రాంతాలకు నీళ్ళు ఇవ్వకుండా తీరని ద్రోహం చేశారన్నారు. సీతారామ ప్రాజెక్ట్ రీ డిజైన్, రీ ఇంజనీరింగ్, రీ ఎస్టిమేషన్ తో ఈ ప్రాజెక్టు నిర్మాణంలో పెద్ద మొత్తంలో అవినీతి అక్రమాలు చోటుచేసుకుని, నాణ్యత లోపించడమే గాక ప్రాజెక్టు ప్రతిపాదిత ప్రాంతాలను విస్మరించడం జరిగిందని విశ్వ అన్నారు. ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుకు 9 సంవత్సరాల కాలంలో పదివేల కోట్ల రూపాయలు ఖర్చు చేసినప్పటికీ ఒక్క ఎకరానికి కూడా క్రొత్త ఆయకట్టుకు నీళు ఇవ్వలేదని ఆయన ఆరోపించారు. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రజాధనం విచ్చలవిడిగా దుర్వినియోగం అవుతుందని ఆరోపించారు. అవినీతి అక్రమాలతో పాటు అధికార దుర్వినియోగం కూడా జరుగుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సీతారామ ప్రాజెక్ట్ జలసాధన కోసం బహుముఖ పోరాటాన్ని నిర్వహించనున్నామని పేర్కొన్నారు. 100 మంది సంతకాలతో దేశంలో, రాష్ట్రంలో ఉన్న 100 మంది అధికార, అనధికార, రాజకీయ



ప్రముఖులకు సీతారామ ప్రాజెక్టులో జరిగిన అవినీతి అక్రమాలు, అన్యాయం గురించి వివరిస్తూ లేఖలు రాయనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యుడు కందునూరి శ్రీనివాస్, మండల కార్యదర్శి అలువాల సత్యవతి, సిపిఐ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గుగులోత్ సక్రు, టిఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గంగావత్ లక్ష్మణ్ నాయక్, పానుగంటి రాధాకృష్ణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు గుండా వెంకటరెడ్డి, టిడిపి మండల నాయకులు రంగరాజు, శివాజీ, కత్తి సత్యం, బహుజన సాహిత్య వేదిక జిల్లా అధ్యక్షుడు వజ్రం నాగేశ్వరరావు, సిపిఎం సీనియర్ నాయకుడు కందునూరి ఈశ్వర్ లింగం, తెలంగాణ గిరిజన సంఘం నాయకుడు బానోత్ హరినాయక్, బిజెపి మండల నాయకుడు అజ్మీర రాము, మాలోత్ మాన్య, చిలక నర్సయ్య పాల్గొన్నారు

# వెంగళరావు కాలనీలో బ్రహ్మంగారి భజన మందిరంలో అన్నదానం



**పాల్వంచ టౌన్ మే 8 నవభూమి ప్రతినిధి:** వీరబ్రహ్మేంద్రస్వామి 332వ ఆరాధన మహోత్సవాల సందర్భంగా పాల్వంచ మున్సిపాలిటీ పరిధి వెంగళరావు కాలనీలోని శ్రీ శ్రీ శ్రీ మాత గోవిందమాంబ సమేత జగద్గురు శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి భజన మందిరంలో గురువారం సుమారు 1000 మంది భక్తులకు అన్నదానం అనంతరం నారాయణ సేవ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర మార్క్ ఫెడ్ మాజీ డైరెక్టర్ డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ అన్నదానం కార్యక్రమం ఎంతో పవిత్రమైనది అని అన్నారు. అన్నదానంతో భాగవత్ సాక్షాత్కారం లభిస్తుందని అన్నారు. భగవంతుని పూజించే ఆరాధించే ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా దానం చేయాలని కొత్వాల అన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు దీగుట్ల వెంకటాచారి, అరిగె గోపికృష్ణ, ముత్యాల బ్రహ్మం, బండారు మురళి, పెద్దోజు సతీష్,





తూముల రమేష్, జ్జోన్నోజు శంకరాచారి, బెల్లకొండ సుధాకర్, నాంపల్లి వేణు, జుజ్జురి ప్రభాకర్, కాంగ్రెస్ నాయకులు సందు ప్రభాకర్, నందిని తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

- జీహెచ్ఎంసీ చీఫ్ ఇంజనీర్‌తో భేటీ
- స్టాండింగ్ కమిటీ సభ్యుడు జగదీశ్వర్ గౌడ్





**శేరిలింగంపల్లి ప్రతినిధి-నవభూమి, మే 8:** శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయాలని గ్రేటర్ చీఫ్ ఇంజనీర్ ను జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు వి.జగదీశ్వర్ గౌడ్ కోరారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్ తో శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్ భేటీ అయ్యారు. శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, విద్యుత్ దీపాల ఏర్పాటు, నిర్వహణ, హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని మంజీరా పైప్ లైన్ రోడ్డు పనులపై చర్చించారు. పనులను వేగవంతం చేయడం, సకాలంలో పూర్తి చేయడం, వీధి దీపాల సమస్యల పరిష్కారం, తదితర అంశాలను చీఫ్ ఇంజనీర్ తో ప్రస్తావించినట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ కమీషనర్, స్టాండింగ్ కమిటీ దృష్టికి ఈ విషయాలను తీసుకెళ్లాలని చెప్పారు. గ్రేటర్ హైదరాబాద్ అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలో మంత్రులు ఎనలేని కృషి చేస్తున్నారని జగదీశ్వర్ గౌడ్ అన్నారు.

# స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇంకుడు గుంతల ఏర్పాటు




కొత్తగూడెం మే 8 నవభూమి ప్రతినిధి: అవకాశం ఉన్న ప్రతి బ్యాంక్ బ్రాంచ్ లోనూ ఇంకుడు గుంత ఏర్పాటు చేయాలని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజినల్ మేనేజర్ సత్యనారాయణ అన్నారు. భూగర్భ జలాల పరిరక్షణకు ఈ ఇంకుడు గుంతలు ఎంతగానో ఉపయోగపడతాయని, నీటి వనరుల సంరక్షణ భావితరాలకు శ్రీరామ రక్ష అని ఆయన అన్నారు. ఎస్.బి.ఐ. రుద్రాంపూర్ బ్రాంచ్ లో గురువారం ఇంకుడు గుంత తవ్వే కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ మేనేజర్ ఈశ్వర్ రావు, లీడ్ బ్యాంక్ మేనేజర్ రామిరెడ్డి, హెచ్.ఆర్. మేనేజర్ రాములు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు

# తెలుగు ప్రేక్షకులకు రాబిన్హుడ్ వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్, ఘరానా మొగుడు సీరియల్ ప్రారంభం







ఖమ్మం, మే 8, (నవభూమి): జీ తెలుగు ఈ వారం వరుస వినోదాత్మక కార్యక్రమాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. థియేటర్లలో విజయం సాధించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'రాబిన్హుడ్' (నితిన్, శ్రీలీల, డేవిడ్ వార్నర్ ముఖ్యపాత్రల్లో) చిత్రాన్ని శనివారం సాయంత్రం 6 గంటలకు వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ప్రసారం చేస్తోంది. ఇక చిన్నారుల ప్రతిభను ప్రదర్శిస్తున్న డ్రామా జూనియర్స్ 8 ఈ వారం మాతృదినోత్సవ ప్రత్యేక ఎపిసోడ్తో శనివారం రాత్రి 9 గంటలకు ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. ఈ ఎపిసోడ్లో దర్శకుడు అనిల్ రావిపూడి తల్లి పాల్గొననున్నారు. అలాగే, ప్రేక్షకాదరణ పొందిన జీ తెలుగు సూపర్ సీరియల్ ఛాంపియన్షిప్ ఆదివారం రాత్రి 9 గంటలకు గ్రాండ్ ఫినాలేతో ముగియనుంది. ఈ ప్రత్యేక ఎపిసోడ్లో రోజా, మంచు లక్ష్మి కనిపించనున్నారు. ఇంతే కాదు, జీ తెలుగు కొత్త కుటుంబ ధారావాహిక ఘరానా మొగుడును మే 12న ప్రారంభిస్తోంది. పవన్ సాయి, అక్షిత ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సీరియల్ ప్రతి రోజూ మధ్యాహ్నం 3 గంటలకు ప్రసారమవుతుంది. భావన, తేజల్, శరత్ చంద్ర, సుచిత్ర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

# బాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్లు

ఖమ్మం, క్రైం, నవభూమి, మే 8: ఇటీవల జారీ చేసిన ఇన్స్పెక్టర్ల బదిలీల ఉత్తర్వుల నేపథ్యంలో గురువారం ఎస్హెచ్వోలు ఖమ్మం వన్ టౌన్ ఇన్స్పెక్టర్ టి. కరుణకర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ మోహన్ బాబు, టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్గా డి. రమేష్ భాధ్యతలు స్వీకరించారు. భాధ్యతలు స్వీకరించిన అనంతరం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ ని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా భాధ్యతలు స్వీకరించిన ఇన్స్పెక్టర్లకు పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేశారు



# ఇంటర్ విద్యార్థి పేరు పోర్టల్‌లో నమోదు

- ఇంటర్ పరీక్ష రాసిన విద్యార్థి పేరు యూడైస్ పోర్టల్‌లో నమోదు అవ్వాల్సిందే: కలెక్టర్ జితేష్ వి పాటిల్ ఆదేశం



కొత్తగూడెం మే 8 నవభూమి ప్రతినిధి: ఇంటర్మీడియట్ పరీక్ష రాసిన ప్రతి విద్యార్థి యూడైస్ం పోర్టల్ లో కచ్చితంగా నమోదు కావాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం ఐ డి ఓ సి లో జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఉత్తీర్ణత శాతంలో బాలికల కంటే బాలురు వెనుకబడి ఉండటానికి గల కారణాలను జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు ను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇంటర్మీడియట్ లో కూడా డిజిటల్ ఎడ్యుకేషన్, ఫేషియల్ అటెండెన్స్ ప్రవేశ పెట్టేలా చూడాలన్నారు. ఇంటర్మీడియట్ కళాశాలలో అతిపెద్ద మైదానాలు ఉన్నప్పటికీ ఇంకుడు గుంతల నిర్మాణం జరగడం లేదని, వెంటనే అన్ని కళాశాలల్లో ఎకరాకి ఐదు ఇంకుడు గుంతలు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఇంటర్మీడియట్ కళాశాలలో పరీక్షకు హాజరైన సంఖ్యకు, యూడైస్ం లో నమోదుకు చాలా తేడాలు ఉన్నాయని, కళాశాల ప్రిన్సిపాల్ లను పిలిపించి జిల్లా విద్యాశాఖ ప్లానింగ్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో అందరూ ఇక్కడే విద్యార్థులందరినీ యుడైస్ ప్లస్ పోర్టల్ లో నమోదు చేసేలా చూడాలని ఆదేశించారు. ఈ సమీక్షల్లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్ చారి, కోఆర్డినేటర్లు, తదితరులు పాల్గొన్నారు.


# జూనియర్ కళాశాలల అతిథి అధ్యాపకులను కొనసాగించాలి

- ఉద్యోగ భద్రత కల్పించాలి.పెండింగ్ లో ఉన్న జీతాన్ని ఇవ్వాలి
- ఎస్. ఎఫ్. ఐ రాష్ట్ర మాజీ గర్ల్స్ కన్వీనర్,అతిథి అధ్యాపకురాలు సాదిన్ని రజిని
- డి.వై.ఎఫ్.ఐ,ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో అతిథి అధ్యాపకులు కలిసి సీపీఐ శాసన సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకి విన్నతి
- అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: శాసన సభ్యులు కూనంనేని వెల్లడి
- అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం
- డి. వై.యఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల.రమేష్



రఘునాథపాలెం, నవభూమి,మే 08: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 1654 మంది అతిథి అధ్యాపకులను కొనసాగించాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలనీ, పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల జీతాని ఇవ్వాలనీ కోరుతూ ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర మాజీ గర్ల్స్ కన్వీనర్,అతిథి అధ్యాపకురాలు సాదిన్ని.రజిని, డి.వై.ఎఫ్.ఐ,ఎస్. ఎఫ్. ఐ ఆధ్వర్యంలో స్థానిక చిమ్మపూడి గ్రామానికి ఓ వివాహ కార్యక్రమానికి విచ్చేసిన కొత్తగూడెం శాసన సభ్యులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని.సాంబశివరావుకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్. ఎఫ్. ఐ రాష్ట్ర మాజీ గర్ల్స్ కన్వీనర్,అతిథి అధ్యాపకురాలు సాదిన్ని రజిని మాట్లాడుతూ గత 10 సంవత్సరాలుగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రాష్ట్ర వ్యాప్తంగా చాలి చాలని వేతనాలతో పేద విద్యార్థులకు చదువుచెప్పి ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి తీవ్రంగా కృషి చేస్తున్నారని ఆమె తెలిపారు. గత విద్యాసంవత్సరం ముగింపులో రెగ్యులర్ జూనియర్ అధ్యాపకుల నియకమంతో మేమంతా డిస్టర్ఫ్ అయ్యామని మమ్మల్ని వచ్చే విద్యాసంవత్సరం నుండి కొనసాగించాలని ఆమె ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. అలానే గత విద్యాసంవత్సరం పనిచేసిన నాలుగు నెలల జీతం పెండింగ్ ఉండటం వల్ల అతిథి అధ్యాపకులు తీవ్రమైన ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని,వెంటనే విడుదల చేయాలని ఆమె అన్నారు.వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేస్తున్న 1654 మంది అతిథి అధ్యాపకులను కొనసాగించే విధంగా,ఉద్యోగ భద్రత కల్పించే విధంగా,పెండింగ్ లో ఉన్న నాలుగు నెలల జీతాని ఇచ్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి గారి దృష్టికి తీసుకెళ్లి అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని సీపీఐ శాసన సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి కూనంనేని.సాంబశివరావును కోరారు. అతిథి అధ్యాపకుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా. ఈ సందర్భంగా వెంటనే స్పందించి కూన%శీ%నేని మాట్లాడుతూ నేను గతంలోనే అసెంబ్లీలో అతిథి అధ్యాపకుల సమస్యలపై ప్రస్తావించాననిమరల తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అతిథి అధ్యాపకుల సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్త ఉద్యమం చేస్తామని డి. వై.యఫ్.ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు చింతల రమేష్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు సిపిఐ రాష్ట్ర నాయకులు భాగం హేమంత్ రావు, సిపిఐ జిల్లా నాయకులు దండి.సురేష్, జానీమియ, మలేష్, డి.వై.ఎఫ్.ఐ,ఎస్.ఎఫ్.ఐ గ్రామ నాయకులు గాడిచర్లకోటేష్, గోపి, స్థానిక సీపీఐ, సిపిఎం నాయకులు తదితరులు పాల్గొన్నారు

# ఎస్సెస్సీ ఫలితాల్లో లోటస్ ల్యాప్ ప్రభంజనం




## పదవ తరగతి ఫలితాల్లో స్టేట్ మూడో ర్యాంకు సాధించిన లోటస్ ల్యాబ్ పబ్లిక్ స్కూల్ సరూర్ నగర్ విద్యార్థిని

**సరూర్‌నగర్-నవభూమిప్రతినిధి:** 25 ఏళ్ల క్రితం స్థాపించిన లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్, సరూర్‌నగర్ బ్రాంచ్ గత కొన్నేళ్లుగా ఎస్ఎస్‌సి 25 బ్యాచ్‌లలు వేలాదిమంది విద్యార్థులను మంచి మార్కులతో ఉత్తీర్ణత పొందారు. ఆ విద్యార్థులు ప్రపంచ దేశాలలో ఉన్నతమైన స్థాయిలో ఉన్నందుకు గర్వపడుతూ 2024- 25 సంవత్సరంకుగాను 10వ తరగతిలో కుమారి శ్రీజా రెడ్డి 594 మార్కులతో తెలంగాణ రాష్ట్రంలో మూడవ స్థానంలో నిలిచింది అదే క్రమంలో మరికొంతమంది ఉత్తమమైన మార్కులు సాధించి ఉన్నారు. అతి ఉత్తమమైన ప్రమాణాలతో విద్యార్థులలో చిన్ననాటి నుండి ప్రాక్టికల్ నాలెడ్జ్ విద్యా విధానానికి నాంది పలికి ఎన్నో పాఠశాలలకు ప్రామాణికంగా నిలిచారు. చదువుతోపాటుగా పిల్లలకు కరాటే యోగ డాన్స్ స్పోర్ట్స్ సంగీతం విద్యార్థులకు నేర్పించడం జరుగుతున్నది. ఈ సంవత్సరం ప్రత్యేకంగా లీడ్ అనే కార్యక్రమాన్ని తీసుకొని విద్యార్థుల్లో నేటి సామాజిక పరిస్థితులకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దడానికి నూతన కార్యక్రమాలు చేపట్టడం జరిగింది.

2025 - 26 గాను ప్రస్తుతం అడ్మిషన్స్ జరుగుతున్నవి విద్యార్థులు పాఠశాల యాజమాన్యం ఈ ఘన విజయాన్ని బాణాసంచా కాల్చి ఆనందాన్ని వ్యక్తం చేశారు



## విలువలతో కూడిన విద్యను అందిస్తున్నాం.. కాబట్టే మంచి ఫలితాలు: చైర్మన్


కడారి చంద్రశేఖర్ రెడ్డి

**సరూర్‌నగర్-నవభూమిప్రతినిధి:** పాఠశాల ఫౌండర్ చైర్మన్ కడారి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాలకు తెలంగాణ రాష్ట్రంలోనే అత్యంత ఉత్తమమైన 594 మార్కులు సాధించిన కుమారి శ్రీజా రెడ్డికి అదే స్థాయిలో ఉన్నతమైన మార్కులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు వారి తల్లిదండ్రులకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలియజేశారు. గత 25 సంవత్సరముల నుండి లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్ నగర్ కర్మన్ ఘాట్ బ్రాంచిలలో చదువుతున్న విద్యార్థిని విద్యార్థులకు మానవతా విలువలు కలిగినటువంటి విద్యను బోధిస్తూ, సమాజంలో ఉన్నతమైన పౌరులుగా తీర్చిదిద్దడానికి వారి బంగారు భవిష్యత్తుకు చక్కటి మార్గాన్ని సూచించడానికి టెక్నాలజీకి అనుగుణంగా ఉత్తమమైన శిక్షణ అందిస్తూ వారి వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందిస్తూ విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందని తెలియజేశారు.

### ఉత్తమ ఫలితాలు సాధించిన లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ సరూర్ నగర్,కర్మన్‌ఘాట్ బ్రాంచ్



## నర్సరీ నుండి పదవ తరగతి వరకు లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్‌లోనే చదివాను: శ్రీజా రెడ్డి

చిన్నారి శ్రీజ మాట్లాడుతూ ఈరోజు నాకు నా తల్లిదండ్రులు ఉన్నతమైన భావాలు కలిగినటువంటి పాఠశాలలో నర్సరీ నుండి పదో తరగతి వరకు చదివించినందుకు ఈ ఉత్తమమైనటు వంటి ఫలితం నాకు లభించిందని భవిష్యత్తుకు నా ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించు కునేందుకు సహకరించిందని పాఠశాల యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఇంటర్మీడియట్‌లో ఎంసెట్లో మంచి మార్కులు సాధించి సాఫ్ట్వేర్ ఉద్యోగాన్ని సాధించాలని తన ఆశయంగా భావిస్తున్నాను అని తెలిపారు


మేనేజింగ్ డైరెక్టర్ కడారి మాధవి

## స్టేట్ ర్యాంకుతో పాటు అందరి విద్యార్థులకు మంచి మార్కులు రావడం ఆనందదాయకం:ఎం.డి

మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి కడారి మాధవి మాట్లాడుతూ ఈ ఉన్నతమైన ఫలితాలు ఉద్దేశించి లోటస్ ల్యాప్ బడి తల్లి ఒడిలో ఉన్నంత విశ్వాసంతో ఉన్నతమైన విలువలు కలిగిన విద్యను అందిస్తున్నందుకు తల్లిదండ్రులు తమ సహాయ సహకారాలను పాఠశాలకు అందజేస్తున్నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులు పదో తరగతిలో రాష్ట్రస్థాయిలో తమ ఉనికిని చాటుకున్నందుకు ఎంతో హర్షించదగ్గ విషయంగా భావిస్తున్నానని మిగిలిన విద్యార్థులు అందరూ మంచి మార్కులు సాధించారని తెలియజేశారు.


చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ శ్రీమతి పద్మజా రెడ్డి(అకాడమిక్)

## ఉపాధ్యాయులు విద్యార్థులకు కృషి ఫలించింది తల్లిదండ్రులకు ప్రోత్సాహం వెలకట్టలేనిది

శ్రీమతి పద్మజా రెడ్డి చీఫ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (అకాడమిక్) మాట్లాడుతూ ఉన్నతమైన విలువలు కలిగిన పాఠశాలలో మంచి విద్యా విధానాన్ని ఉపాధ్యాయిని ఉపాధ్యాయులతో ఒక ఉన్నతమైనటువంటి సాంకేతిక పరమైన విధానంతో ముందుకు వెళుతూ 2024- 25 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్రంలో 3వ ర్యాంకు సాధించినందుకు ప్రత్యేకించి పిల్లలకు వారి తల్లిదండ్రులకు అంకితభావంతో విద్యను బోధించినటువంటి ఉపాధ్యాయులందరికీ కూడా అభినందనలు తెలియజేస్తూ హర్షం వ్యక్తం చేశారు